సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
బుధవారం । 6 । మార్చి । 2024



అన్నా.. మేము సిద్ధం



ఆత్మీయనేతకు పుష్పాభిషేకం

అపూర్వ స్వాగతం

నగరంలో జరిగిన కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అపూర్వ స్వాగతం లభించింది. రాడిసన్ బ్లూ హోటల్ ముందు కార్యకర్తలు, అభిమానులు సిద్ధం ప్లకార్డులు ప్రదర్శించి స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి కాన్వాయ్‌పై పూలు చల్లుతూ తమ అభిమానాన్ని చాటుకున్నారు.

న్యూస్‌రీల్

అనకాపల్లి జిల్లాలో సీఎం జగన్ పర్యటన ఖరారు

- రేపు పిసినికాడలో 'చేయూత' నిధులు విడుదల చేయనున్న ముఖ్యమంత్రి

సాక్షి, అనకాపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 7న అనకాపల్లి జిల్లాకు రానున్నారు. ఈ మేరకు మంగళవారం పర్యటన షెడ్యూల్ అధికారికంగా ఖరారయింది. సీఎం ప్రత్యేక విమానంలో ఉదయం 10.20 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టుకు వస్తారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 10.45 గంటలకు కొంకోట మండలం ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు. స్థానిక ప్రజాప్రతినిధులతో 10 నిమిషాల పాటు ముచ్చటిస్తారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన ప్రయాణించి 11.15 గంటలకు పిసినికాడ వద్ద గల సభావేదిక వద్దకు చేరుకుంటారు. 11.20 గంటలకు వేదికపై మహానేత వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తారు. 11.40 గంటల నుంచి 12.40 గంటల వరకు గంట పాటు సీఎం ప్రసంగిస్తారు. అనంతరం వైఎస్సార్ చేయూత చివరి విడత నిధుల పంపిణీని బటన్ నొక్కి ప్రారంభిస్తారు. మహిళామార్ట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి అవార్డులు ప్రదానం చేస్తారు. మధ్యాహ్నం 12.55 గంటలకు బయలుదేరి కొంకోటలో హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు. గంటసేపు ప్రజాప్రతినిధులతో ముచ్చటించిన అనంతరం 2.10 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడ నుంచి 2.35 గంటలకు విమానంలో గన్నవరం ఎయిర్‌పోర్టుకు తిరుగుపయనమవుతారు.

తెల్లరేషన్‌కార్డుదారులకు రాగిపిండి పంపిణీ

- కిలో రూ.11కు సరఫరా
- జాయింట్ కలెక్టర్ భావన వశిష్ఠ

సాక్షి,పాడేరు: జిల్లాలోని తెల్లరేషన్‌కార్డుదారులకు కిలో రూ.11తో రాగిపిండిని ఈనెల నుంచి పంపిణీ చేపట్టామని జాయింట్ కలెక్టర్ భావన వశిష్ఠ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా బియ్యం, పంచదార, కందిపప్పును సరఫరా అవుతోందన్నారు.అలాగే ఈ ఏడాది మార్చి నుంచి గోధుమపిండిని కూడా రేషన్‌డిపోల్లో పొందవచ్చని ఆమె పేర్కొన్నారు.

నేడు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

సాక్షి,పాడేరు: పాడేరు,అరకులోయ నియోజకవర్గాల పరిధిలోని రూ.6.50కోట్ల అభివృద్ధి పనులకు బుధవారం మధ్యాహ్నం పాడేరు ఐటీడీఏలో శంకుస్థాపన చేసేలా ఇంజనీరింగ్ అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు. వీటికి గాను కలెక్టర్ ఎం.విజయసునీత, ఐటీడీఏ పీవో వి.అభిషేక్, అరకు,పాడేరు ఎమ్మెల్యేలు చెట్టి పాల్గుణ, కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి చేతుల మీదుగా శంకుస్థాపన జరగనుంది.

మత్స్యగుండం జాతర పోస్టర్లు ఆవిష్కరణ




పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సర్పంచ్ శాంతకుమారి, ఉత్సవ కమిటీ సభ్యులు

హుకుంపేట: ప్రముఖ పుణ్యక్షేత్రం, ఆధ్యాత్మిక కేంద్రమైన మత్యగుండం మహాశివరాత్రి జాతర పోస్టర్లను మంగళవారం మత్స్యాలింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో సర్పంచ్ మఠం శాంతకుమారి, ఉత్సవకమిటీ సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ 7,8,9 తేదీల్లో జరిగే జాతరకు చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. ఉత్సవ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు గోపాల పాత్రుడు, మత్స్యకొండబాబు, ఆలయ కమిటీ సభ్యులు అప్పారావు, సూర్యనారాయణ, సింహాచలం, పాత్రుడు, భీమ్‌బాబు, ఈశ్వర్, రాంబాబునాయుడు, మోహన్ పాల్గొన్నారు.

రికార్డులు సక్రమంగా లేకుంటే చర్యలు

- రంపచోడవరం ఆర్టీవో రాజేష్‌కుమార్
- 24 వాహనాలకు రూ.40 వేల జరిమానా



డి.భీమవరం రోడ్‌లో ఆటో రికార్డులు తనిఖీ చేస్తున్న రంపచోడవరం ఆర్టీవో రాజేష్‌కుమార్

అడ్డతీగల: రవాణాశాఖ నిబంధనలకు అనుగుణంగా రికార్డులు లేని వాహనాలపై చర్యలు తీసుకున్నామని రంపచోడవరం ఆర్టీవో రాజేష్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన అడ్డతీగలలోని వేటమామిడి సెంటర్, డి.భీమవరం, జెడ్డంగి వైపు వెళ్లే మార్గాల్లో ఆయన వాహన తనిఖీలు నిర్వహించారు. రికార్డులు సక్రమంగా లేని 24 వాహనాలకు రూ.40 వేల జరిమానా విధించినట్లు ఆయన తెలిపారు.

వీ-కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి జగన్ సమక్షంలో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంటున్న వివిధ సంస్థల ప్రతినిధులు





విశాఖ పరిపాలన భవన నమూనాను ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్

ఇదీ జగన్ విజన్

- నగర రూపురేఖలు మార్చేలా 'విజన్ విశాఖ' ప్రకటన
- ఐదు విభాగాల వారీగా అభివృద్ధి
- రూ.లక్షా 5 వేల కోట్ల వ్యయంతో ప్రణాళికలు
- ప్రమాణ స్వీకారమూ విశాఖలోనేనని ప్రకటన
- వైజాగ్‌పై సీఎం మమకారం.. నగర వాసుల్లో హర్షాతిరేకం



విజన్ విశాఖ ప్రజెంటేషన్‌ను వీక్షిస్తున్న సీఎం జగన్, మంత్రులు బొత్స, రజని, ముత్యాలనాయుడు, అమర్, సురేష్



జీవీఎంసీలో అభివృద్ధి పనుల శంకుస్థాపన అనంతరం నమూనా చిత్రాలను పరిశీలిస్తున్న, సీఎం జగన్

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

ప్రపంచ పటంలో విశాఖను తీవిగా నిలబెట్టేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన విజన్‌ను స్పష్టంగా ప్రకటించారు. రానున్న ఐదేళ్ల కాలంలో విశాఖ నగర కేంద్రంగా చేపట్టే అభివృద్ధి పనులు, వచ్చే పెట్టుబడులు, జరిగే కార్యక్రమాలను వివరిస్తూ ఆయన విడుదల చేసిన 'విజన్ విశాఖ'పై సర్వత్రా చర్చ జరుగుతోంది. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై నగరాలకు దీటుగా.. విశాఖ అభివృద్ధికి ఉన్న అవకాశాలను ముఖ్యమంత్రి వివరించిన తీరు.. సమావేశానికి హాజరైన పారిశ్రామికవేత్తలు, వాణిజ్యవర్గాలతో పాటు నగర వాసులను ఆకట్టుకుంది. విశాఖ నగర అభివృద్ధిని అడ్డుకునేందుకు ప్రతిపక్షాలతో పాటు పచ్చపత్రికలు విషం కక్కుతున్న తీరును ఆయన సూటిగా ఎత్తిచూపారు.

'విజన్ విశాఖ'లో భాగంగా ఏపీ డెవలప్‌మెంట్ డైలాగ్ విత్ సీఎం కార్యక్రమం, విద్యార్థుల్లో నైపుణ్యం పెంచేందుకు వీలుగా భవిత కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు తాడేపల్లి నుంచి సీఎం వైఎస్ జగన్ మంగళవారం ఉదయం నగరానికి చేరుకున్నారు. రాడిసన్ బ్లూ హోటల్‌లో నిర్వహించిన 'విజన్ విశాఖ'లో సీఎం ప్రసంగించారు. రాష్ట్రాభివృద్ధిలో భాగంగా నగరాభివృద్ధిని వివరించిన తీరు అటు పారిశ్రామికవేత్తలను ఇటు వ్యాపారవర్గాలను ఆకట్టుకుంది. కేవలం మాటలతోనే సరిపెట్టకుండా.. ఈ సందర్భంగా నగరంలో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు ఇదే వేదికగా ఆయన శంకుస్థాపనలు కూడా చేశారు. ఎన్నికల తర్వాత విశాఖలోనే ప్రమాణ స్వీకారం చేస్తానని.. ఇక్కడి నుంచే పరిపాలిస్తానంటూ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చేసిన ప్రకటనతో నగరవాసుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. విశాఖ నగరంపై ఆయనకున్న ప్రేమను మరోసారి నగరవాసులు గుర్తు చేసుకున్నారు. అనంతరం పీఎంపాలెంలోని వీ-కన్వెన్షన్‌లో భవిత కార్యక్రమాన్ని ప్రారంభించి.. యువతనుద్దేశించి మాట్లాడారు. పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా చదువుకునే సమయంలోనే విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టడం అభినందనీయమని పారిశ్రామికవేత్తలు కొనియాడారు.

ఐదేళ్లు.. ఐదు విభాగాలు

విశాఖ నగరాన్ని ప్రపంచపటంలో ప్రముఖంగా నిలబెట్టేందుకు వీలుగా రానున్న ఐదేళ్ల కాలంలో ఐదు ప్రధాన విభాగాల్లో చేపట్టనున్న అభివృద్ధి ముఖ చిత్రాన్ని సీఎం జగన్ ఆవిష్కరించారు. సుమారు రూ.1,05,000 కోట్లతో ఏయే విభాగాల్లో ఎంత మేర వ్యయం చేయనున్నామనే అంశాన్ని పేర్కొన్నారు.

- కనెక్టివిటీ
- ఇండస్ట్రియల్ ల్యాండ్ స్కేప్
- అర్బన్ ప్లానింగ్, సిటీ ఇన్ఫ్రాస్ట్రక్చర్
- సోషల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్
- స్థిర అభివృద్ధి- పర్యావరణ సమతుల్యత

విశాఖ.. ఎకనామిక్ గ్రోత్ ఇంజిన్

రాష్ట్ర అభివృద్ధికి ఒక గ్రోత్ ఇంజిన్ అవసరమని.. అది విశాఖపట్నమేనని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రకటించారు. రాష్ట్ర ఆర్థిక వనరుల పెంపుతో పాటు పారిశ్రామికంగా, సర్వీసురంగపరంగా.. విద్య, వైద్యంతో పాటు హోటల్స్ ఇలా అన్ని రంగాల్లో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నిలబెట్టే సత్తా విశాఖ నగరానికి ఉందని సీఎం పేర్కొనడాన్ని నగరవాసులు ఆహ్వానించారు. విశాఖ నగర అభివృద్ధి ముఖ చిత్రాన్ని ఈ సందర్భంగా ఆయన స్పష్టంగా ఆవిష్కరించారు. ఇందుకోసం ఇప్పటికే చేపడుతున్న కార్యక్రమాలతో పాటు చేపట్టబోయే అంశాలను వివరించారు. రాష్ట్రాభివృద్ధిలో విశాఖ ప్రాధాన్యం, పరిపాలన రాజధానిగా ఎందుకు విశాఖను ఎంపిక చేశామో.. సీఎం వివరించిన తీరు అందరినీ ఆకట్టుకుంది. సదస్సుకు హాజరైన పారిశ్రామిక, వాణిజ్య వర్గాలు సీఎం విజన్‌ను మెచ్చుకున్నారు. విశాఖను కీర్తిస్తూ సీఎం ప్రసంగించిన ప్రతీసారి సభికుల నుంచి కరతాలధ్వనులతో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కో-ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వై.వి.సుబ్బారెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజని, మంత్రులు బొత్స సత్యనారాయణ, గుడివాడ అమర్‌నాథ్, ఆదిమూలపు సురేష్, ఎంపీలు ఎంవీవీ సత్యనారాయణ, బి.వి.సత్యవతి, మేయర్ హరి వెంకటకుమారి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, తిప్పల నాగిరెడ్డి, కరణం ధర్మశ్రీ, అదీప్‌రాజ్, ఉమాశంకర్ గణేష్, కంబాల జోగులు, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, డీసీసీబీ చైర్మన్ కోలా గురువులు, వైఎస్సార్ సీపీ విశాఖ పార్లమెంట్ సమన్వయకర్త బొత్స ఝాన్సీ, నెడ్‌క్యాప్ మాజీ చైర్మన్ కె.కె.రాజు, పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీలక్ష్మి, కలెక్టర్ మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్ట్‌లను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి





రాడిసన్ బ్లూలో జరిగిన విజన్ విశాఖ కార్యక్రమానికి హాజరవుతున్న పారిశ్రామిక, వాణిజ్యవేత్తలు



వీ- కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, విద్యావేత్తలు, విద్యార్థులు

గ్రామ సచివాలయ వ్యవస్థతో పారదర్శక పాలన



వామగడ్డ కొత్తూరులో ఆర్‌బీకే భవనాన్ని ప్రారంభిస్తున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టిగుళ్ల భాగ్యలక్ష్మి



గొందిపాకలో గ్రామ సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టిగుళ్ల భాగ్యలక్ష్మి

- పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి
- గ్రామ సచివాలయం, ఆర్‌బీకే భవనాలు ప్రారంభం

చింతపల్లిరూరల్: జగనన్న ప్రవేశపెట్టిన గ్రామ సచివాలయాల వ్యవస్థతోనే పారదర్శక పాలన సాధ్యమైందని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని చౌడుపల్లి పంచాయతీ వామగడ్డ కొతూరు ఆర్‌బీకే, గొందిపాకల్లో గ్రామ సచివాలయ భవనాలను మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి వేదికలుగా గ్రామ సచివాలయాలు ప్రజలకు ఉపయోగపడుతున్నాయన్నారు. వీటి ద్వారా అందుతున్న సేవలను వివరించారు. ప్రజల వద్దకు పాలన తీసుకువచ్చి గ్రామ స్వరాజ్యం సాధించాలన్న గాంధీజీ ఆశయం జగనన్న ఆలోచనతో సాధ్యమైందన్నారు. ప్రతి పనికి రూ. వందలు ఖర్చు చేసుకుని మండల కేంద్రాలకు వెళ్లే ప్రజలు ఇప్పుడు ఇళ్ల వద్ద ఉండి వలంటీర్ల ద్వారా ప్రభుత్వ సేవలు పొందుతున్నారన్నారు. 40 ఏళ్ల రాజకీయ అనుభవం, మూడు సార్లు ముఖ్యమంత్రిగా చేసిన చంద్రబాబుకు ప్రజలకు గుర్తుండి పోయే ఒక్క పని చేయాలన్న ఆలోచన రాకపోవడం రాష్ట్ర ప్రజల దురదృష్టమన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య, పీఆర్ డీఈ నరేస్ కుమార్, జేఈ బాలకిశోర్, సర్పంచ్‌లు లలిత, వరలక్ష్మి, ఎంపీటీసీలు పద్మ, మీనా కుమారి, తాంబేలు మోహన్‌రావు, పోట్టిక లోవరాజు, మండల అధ్యక్షుడు మోరి రవి, కోఆప్షన్ సభ్యులు నాజర్ వలీ తదితరులు పాల్గొన్నారు.

సీఆర్‌టీ తొలగింపు

కొయ్యూరు: స్థానిక కేజీబీవీలో ఆంగ్ల టీచర్‌గా విధులు నిర్వహిస్తున్న సీఆర్‌టీ డి.శాంతకుమారిని విధుల నుంచి తొలగించారు. నాడు- నేడులో సరియైన పర్యవేక్షణ లేకపోవడంతో పాటు విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్న అభియోగాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖాధికారి బ్రహ్మాజీరావు చర్యలు తీసుకున్నారు. ఆగస్టు, 2023లో బాలల హక్కుల కమిషన్ పాఠశాలను సందర్శించింది. సీఆర్‌టీపై వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదించిన నేపథ్యంలో తొలగిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

సోలార్ విద్యుత్ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

- రాజమహేంద్రవరం పోస్టల్ సూపరింటెండెంట్ కోమల్ కుమార్

మారేడుమిల్లి : కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెట్టిన ప్రధాన మంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని రాజమహేంద్రవరం పోస్టల్ సూపరింటెండెంట్ పి. కోమల్ కుమార్ కోరారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఈ పథకం గురించి లబ్ధి పొందాలనుకునేవారు తమ పేర్లను సమీప తపాలా కార్యాలయంలో నమోదు చేసుకోవాలని సూచించారు. ఇప్పటికే పోస్టల్ శాఖ సర్వే నిర్వహిస్తోందని తెలిపారు. ప్రతి ఇంటికి 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తుందని, 150 యూనిట్లు వినియోగానికి ఒక కిలో వాట్ సామర్థ్యం గల సోలార్ ప్యానల్‌ను ఏర్పాటుచేసుకోవాలన్నారు. ఇందుకు రూ. 55 వేల నుంచి రూ.65 వేల వరకు వ్యయం అవుతుందన్నారు. ఒక కిలోవాట్‌కు కేంద్ర ప్రభుత్వం రూ. 30 వేల వరకు రాయితీ కల్పిస్తుందని తెలిపారు. సొంతిల్లు ఉన్నవారు అందరూ ఈ పథకానికి అర్హులే అన్నారు. ఈ పథకంలో మూడు కిలోవాట్ల వరకు సబ్సిడీ లభిస్తుందన్నారు. పోస్టల్ శాఖ సిబ్బంది వివరాలను నమోదు చేస్తున్నారని వెల్లడించారు. రిజిస్టర్ కోసం మొబైల్ నెంబర్, గత నెల విద్యుత్ బిల్లు ఉండాలన్నారు. మొదటి విడతలో భాగంగా రిజిస్టర్ చేసుకున్న కోటి మందికి మాత్రమే సబ్సిడీ లభిస్తుందని తెలిపారు. వివరాల కోసం రంపచోడవరం డివిజన్ ఏంవో ఈశ్వర్ బాబును 9000580560, 9642431398లో సంప్రదించాలని కోరారు.

ఉమానీలకంఠేశ్వరునికి ఉత్సవ శోభ

సాక్షి,పాడేరు: పట్టణంలోని ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయంలో బుధవారం నుంచి మహాశివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సింహాచలంనాయుడు, ఆధ్యాత్మిక కమిటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో జరగనున్నాయి. నూతన పట్టువస్త్రాలను పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, డాక్టర్ నర్సింగరావు దంపతులు తీసుకువచ్చి ఉమానీలకంఠేశ్వరస్వామివారికి సమర్పిస్తారు. అనంతరం సాయంత్రం స్వామివారి కల్యాణం నిర్వహిస్తారు.



ఉమానీలకంఠేశ్వరస్వామి

శివరాత్రి ఉత్సవాలకు పక్కాగా ఏర్పాట్లు

రంపచోడవరం సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్, ఏఎస్పీ జగదీష్ అడహళ్లి

రంపచోడవరం: రంపలో మహాశివరాత్రి ఉత్సవాలు నిర్వహణకు పక్కా ఏర్పాట్లు చేయాలని రంపచోడవరం సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. ఏజెన్సీలో శివరాత్రి ఉత్సవాలకు సంబంధించి ఏఎస్పీ జగదీష్ అడహళ్లితో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 8వ తేదీన రంపతో పాటు ఏజెన్సీలో వివిధ శివాలయాల్లో ఐదు రోజుల పాటు నిర్వహించే ఉత్సవాలకు భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. రంప గ్రామంలో వెలసిన భ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఆలయంలో ఎనిమిదో తేదీ నుంచి 12వ వరకు ఐదు రోజులపాటు జరిగే శివరాత్రి ఉత్సవాలకు భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా తగు చర్యలు చేపట్టాలని వివిధ శాఖలకు సంబంధించిన అధికారులను ఆయన ఆదేశించారు, ఈ సందర్భంగా ప్రత్యేక వైద్యశిబిరం ఏర్పాటు చేయాలని, భక్తులకు తాగునీరు అందుబాటులో ఉంచాలన్నారు. ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపట్టి పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఎనిమిదో తేదీ ఉదయం నుంచి రంప శివాలయం వరకు బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని గోకవరం ఆర్టీసీ డీఎంను ఆదేశించారు. ఏఎస్పీ మాట్లాడుతూ శివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేస్తామన్నారు. రంప శివాలయాన్ని, శివరాత్రి ఉత్సవ ఏర్పాట్లను సబ్ కలెక్టర్, ఏఎస్పీలు పరిశీలించారు. ఏడీఎంహెచ్‌వో ప్రకాశం, డీఎల్పీవో రాఘవన్, ఎంపీడీవో హరికృష్ణ, తహసీల్దార్లు సత్యనారాయణ, చలపతిరావు, సీఐ వాసా వెంకటేశ్వరరావు, ఎస్ఐ మోహనరావు, ఏఈ శ్రీనివాసరావు ఆర్టీసీ డీఎం రమణ పాల్గొన్నారు.





విశాఖ నగరానికి వచ్చిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, ఎమ్మెల్సీ కుంభా రవిబాబు

సమపాళ్లలో సంక్షేమం, అభివృద్ధి



గొందిపాకలు–చిక్కుడు బట్టి రోడ్డు ప్రారంభ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

చింతపల్లిరూరల్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మారుమూల గ్రామాలకు కూడా రోడ్డు సౌకర్యం కల్పిస్తున్నట్టు పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి తెలిపారు. మండలంలో గొందిపాకలు నుంచి చిక్కుడుబట్టి వరకు రూ.50 లక్షల ఉపాధిహామీ పథకం నిధులతో నిర్మించిన బీటీ రోడ్డును ఆమె మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి పనులకు తగిన ప్రాధాన్యం ఇస్తున్నట్టు చెప్పారు. గ్రామాలు, మండల కేంద్రాలు, పట్టణాలకు అనుసంధానం చేస్తూ రహదారుల నిర్మించేందుకు అధిక ప్రాధాన్యం ఇచ్చినట్టు తెలిపారు. ఈ ఐదేళ్ల కాలంలో చాలా గ్రామాల్లో రోడ్లు నిర్మించినట్టు చెప్పారు. ఇంత అభివృద్ధి జరిగినా ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య, కొయ్యూరు ఎంపీపీ బడుగు రమేష్, ఎంపీడీవో వీరసాయిబాబు, సర్పంచ్ వరలక్ష్మి, ఎంపీటీసీలు మోహన్‌రావు, లోవరాజు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మోరి రవి, డీఈ నరేస్‌కుమార్,జేఈ బాలకిశోర్, నాయకుల పాంగి గణబాబు, రఘునాథ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించండి

- జాయింట్ కలెక్టర్ భావన వశిష్ఠ



లోతుగెడ్డలో పోలింగ్ కేంద్రం వద్ద సూచనలిస్తున్న జాయింట్ కలెక్టర్ భావన వశిష్ఠ

చింతపల్లి రూరల్: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని జాయింట్ కలెక్టర్ భావన వశిష్ఠ కోరారు. మండలంలో మావోయిస్టు ప్రభావిత మారుమూల గ్రామాలైన బలపం, రాళ్లగెడ్డ, కుడుమసారి, లోతుగెడ్డ, అన్నవరం గ్రామ సచివాలయాల పరిధిలోని పోలింగ్ కేంద్రాలను ఆమె మంగళవారం సందర్శించారు. వసతులను పరిశీలించారు. ప్రతీ గ్రామంలో ఓటు హక్కు వినియోగంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో డీటీ రాజ్ కుమార్, సెక్టార్ అధికారులు ఏవో శ్రీనివాస్, ఏఈ భరతుడు, ఏపీఎం నాయుడు, రూట్ అధికారులు, బూత్ లెవెల్ అధికారులు పాల్గొన్నారు.

ఓటర్లకు ఇబ్బందులు లేకుండా చర్యలు

- కలెక్టర్ విజయ సునీత ఆదేశం
- పోలింగ్ కేంద్రాల సందర్శన
- విద్యార్థుల సామర్థ్యం పరిశీలన



చింతూరులో అధికారులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్ విజయ సునీత



సున్నంపాడులోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ విజయ సునీత

చింతూరు: రాబోయే ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు చేపట్టాలని కలెక్టర్ విజయసునీత ఆదేశించారు. మంగళవారం ఆమె ఐటీడీఏ పీవో కావూరి చైతన్యతో కలసి మండలంలోని తులసిపాక, చింతూరులోని జెడ్పీ ఉన్నత పాఠశాల, చట్టిలోని ఎంపీయూపీఎస్, చిడుమూరులోని ఎంపీపీఎస్ పాఠశాలల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా పోలింగ్ కేంద్రాలకు వచ్చే ఓటర్ల వివరాలను తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్ సౌకర్యం, మరుగుదొడ్లు వంటి మౌలిక సౌకర్యాలు ఉండేలా చర్యలు చేపట్టాలని సెక్టార్, బూత్‌లెవల్ అధికారులను ఆదేశించారు. మౌలిక సదుపాయాలకు సంబంధించి ఓటర్ల నుంచి ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా ఉపేక్షించేది లేదని, ఎన్నికల తేదీకంటే ముందుగానే అన్ని వసతులు ఉండేలా చూసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ఎలాంటి వివాదాలకు తావులేకుండా నిష్పక్షపాతంగా, సజావుగా ఎన్నికల నిర్వహణ జరిగేలా అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని ఆమె సూచించారు. ఎన్నికల విధులు, మౌలిక వసతులకు సంబంధించి సెక్టార్, బూత్‌లెవల్ అధికారులకు ఏమేర అవగాహన ఉందనే విషయాన్ని తెలుసుకున్న ఆమె ఎన్నికల విధులకు సంబంధించి అధికారులకు సూచనలు చేశారు.

విద్యతోనే మీ భవిష్యత్తు

విద్యతోనే మంచి భవిష్యత్తు సాధ్యమని కలెక్టర్ విజయసునీత అన్నారు. చింతూరులోని పోలింగ్ కేంద్రాల పరిశీలనలో భాగంగా తరగతి గదుల్లో ఉన్న విద్యార్థులతో ఆమె ముచ్చటించారు. పాఠ్య పుస్తకాలను పరిశీలించారు. సిలబస్‌పైవిద్యార్థులను ప్రశ్నలు అడిగి వారి సామర్థ్యాన్ని పరిశీలించారు. కష్టమైన ప్రశ్నలను సులువుగా అర్థం చేసుకోవడం ద్వారా అవి పోటీ పరీక్షలకు ఎంతగానో దోహద పడతాయని ఆమె సూచించారు. ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను శ్రద్ధగా విని పరీక్షలకు సిద్ధం కావాలన్నారు. మంచి ఉత్తీర్ణత సాధించడం ద్వారా పాఠశాలతో పాటు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని ఆమె సూచించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన కలెక్టర్ విద్యార్థులకు మెనూ ప్రకారం ఆహారం అందించాలని, నాణ్యతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నజీముల్లాషా, ఎంపీడీవో రవిబాబు, ఎస్‌ఐ శ్రీనివాసరావు, సెక్టర్, బూత్‌లెవల్ అధికారులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్ష కేంద్రం పరిశీలన

మారేడుమిల్లి : ఏజెన్సీలో ఇంటర్మీడియట్ పరీక్షలు రాసే విద్యార్థులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసే విధంగా చర్యలు తీసుకున్నామని కలెక్టర్ యం. విజయ సునీత అన్నారు. మంగళవారం ఆమె మండలంలో పర్యటించారు. స్థానిక గిరిజన సంక్షేమ గురుకుల ఆశ్రమ బాలుర జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. అనంతరం సున్నంపాడు, మారేడుమిల్లిలోని పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఆమె వెంట తహసీల్దార్ వెంకట రమణారావు ఉన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ సయ్యద్‌మౌలానాఫాజిల్

వీఆర్‌పురం: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా అన్ని శాఖల అధికారులు సమష్టిగా కృషి చేయాలని తహసీల్దార్ సయ్యద్‌మౌలానాఫాజిల్, ఎంపీడీవో ఆర్.ఫణేంద్ర రెడ్డి అన్నారు. రేఖపల్లిలోని ఏఎస్‌డీఎస్ స్వచ్ఛంద ఆధ్వర్యంలో సంక్షేమ పథకాల అమలు–అధికారుల పాత్ర అనే అంశంపై వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వారు ముఖ్యఅతిథులుగా మాట్లాడారు. ముఖ్యంగా నవరత్న పథకాల అమలులో సచివాలయ వ్యవస్థ కీలకమన్నారు. కొంత మంది అర్హత ఉండి ఆధార్ అప్‌డేట్ తదితర చిన్న పొరపాట్ల వల్ల సంక్షేమ ఫలాలు పొందలేక పోతున్నారని, అలాంటి సమస్యలకు పరిష్కారం చూపేలా సంబంధిత అధికారులు కృషి చేయాలన్నారు. ఏజెన్సీలో పని చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు పీసా చట్టంపై కూడా అవగాహన పెంపొందించుకోవాలని తెలిపారు. పోలవరం ఆర్అండ్ఆర్, గృహపరిహారం తదితర అంశాలపై కూడా పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉంటే బాధితుల సమస్యలు పరిష్కరించేందుకు అవకాశం కలుగుతుందన్నారు. సమావేశంలో ఏఎస్‌డీఎస్ సంస్థ డైరెక్టర్ ఉండవల్లి గాంధీబాబు ,జెడ్పీటీసీ వాళ్ల రంగారెడ్డి, ఎంపీపీ కారం లక్ష్మి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త రేగం మత్స్యలింగం



బారమసిలో అటవీహక్కు పత్రాలు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయ కర్త రేగం మత్స్యలింగం

హుకుంపేట: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని వైఎస్సార్‌సీపీ అరకు అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్త రేగం మత్స్యలింగం తెలిపారు. మంగళవారం మండలంలోని కోడెలి,సూకురు,బారమసి తదితర గ్రామాల్లో ఆయన పర్యటించారు. కోడెలిలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.2లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. బారమసిలో గిరిజనులకు ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాలు, సూకురు పంచాయతీలో ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఆయా గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో ఆయన మాట్లాడుతూ గిరిజనుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్ద పీట వేసిందని చెప్పారు. గ్రామాల్లో సీసీరోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలు, తాగునీటి సౌకర్యం కల్పన పనులు ముమ్మరంగా జరుగుతున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గెమ్మెలి కొండబాబు,వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు ఒంటుబు సామ్యేల్, జేసీఎస్ మండల ఇన్‌చార్జి కె.రామకృష్ణ, మాజీ వైస్ ఎంపీపీ బత్తిరి రవిప్రసాద్, సర్పంచ్ దనసాని సత్యవతి, ఎంపీటీసీ కిలగడ సింహాచలం, నాయకులు కోటిబాబు, జన్ని సింహాచలం, అనిల్, మురళి రాజారావు పాల్గొన్నారు.

పలు రైళ్ల దారి మళ్లింపు

తాటిచెట్లపాలెం: దక్షిణ మధ్య రైల్వే గుంతకల్ డివిజన్, తిరుపతి స్టేషన్ ఆధునికీకరణ పనుల్లో భాగంగా ఈ మార్గంలో ప్రయాణించే పలు రైళ్ల దారి మళ్లిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం త్రిపాఠి తెలిపారు. ఈ నెల 11, 18 తేదీల్లో బయల్దేరే ఎస్ఎంవీటి బెంగళూరు–టాటానగర్(12890) ఎక్స్‌ప్రెస్ వయా కాట్పాడి, అరక్కోణం జంక్షన్, రేణిగుంట మీదుగా నడుస్తుంది. ఈ నెల 12,14,19,21 తేదీల్లో బయల్దేరే ఎస్ఎంవీటీ బెంగళూరు -హతియా (12836) సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ వయా కాట్పాడి, అరక్కోణం జంక్షన్, రేణిగుంట మీదుగా నడుస్తుంది. ఈ నెల 16వ తేదీన బయల్దేరే మంగళూరు సెంట్రల్–సంత్రగచ్చి (22852) వివేక్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ వయా కాట్పాడి, అరక్కోణం, రేణిగుంట మీదుగా నడుస్తుంది.

అప్పన్న హుండీ ఆదాయం రూ.1.93 కోట్లు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి హుండీ ఆదాయం రూ.1,93,77,877 వచ్చినట్టు సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. సింహగిరిపై మంగళవారం హుండీ ఆదాయాన్ని లెక్కించారు. నగదుతో పాటు 136.350 గ్రాముల బంగారం, 11.420 కిలోల వెండి లభించినట్టు ఈవో వెల్లడించారు. సింహగిరిపై ఉన్న యాత్రిక సదన్‌లో ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన లెక్కింపులో దేవస్థానం అధికారులు, సిబ్బంది, పలు స్వచ్ఛంద సంస్థలకు చెందిన సభ్యులు పాల్గొన్నారు.

శివరాత్రి ఉత్సవ ఏర్పాట్లపై పరిశీలన



జడ్డంగి శివాలయం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీఐ సన్యాసినాయుడు

రాజవొమ్మంగి : మండలంలోని జడ్డంగిలో గల శ్రీ భ్రమరాంబికామల్లికార్జున స్వామి క్షేత్రంలో నిర్వహించనున్న మహాశివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లను స్థానిక సీఐ సన్యాసినాయుడు మంగళవారం పరిశీలించారు. ఇక్కడ జరిగే ఉత్సవాలకు వేలాదిగా తరలిరానున్న భక్తుల కోసం అన్ని సదుపాయాలు కల్పించాలని ఉత్సవకమిటీకి సూచించారు. భక్తులు పుణ్య స్నానాలాచరించేందుకు సమీప మడేరు నది వద్ద చేపడుతున్న ఏర్పాట్లపై చర్చించారు. శివరాత్రి సందర్భంగా ఆలయ పరిసరాల్లో 70 మంది స్పెషల్, సివిల్ పోలీసు సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని సీఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్డంగి ఎస్‌ఐ రఘునాథరావు, జడ్డంగి సర్పంచ్ కొంగర మురళీకృష్ణ, గ్రామపెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు శింగిరెడ్డి రామకృష్ణ, కొంగర బాబ్జీదొర, శింగిరెడ్డి రవి, గణజాల తాతారావు తదితరులు పాల్గొన్నారు.

సరిహద్దులో వాహన తనిఖీలు



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ పార్థసారథి

ఎటపాక: ఆంధ్రా,తెలంగాణ రాష్ట్రాల సరిహద్దుల్లో ఎటపాక పోలీసులు మంగళవారం వాహన తనిఖీలు నిర్వహించారు. బొజ్జిగుప్ప వద్ద ఎస్‌ఐ కె.పార్థసారథి ఆధ్వర్యంలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. పొరుగు రాష్ట్రం నుంచి మన రాష్ట్రంలోకి వచ్చే ప్రతి వాహనాన్ని ఆపి క్షుణ్ణంగా పరిశీలించారు. అనుమానిత వ్యక్తుల వివరాలు నమోదు చేసుకున్నారు. ఇటీవల మావోయిస్టుల పేరుతో పోస్టర్లు,కరపత్రాలు ఏజెన్సీలో వెలువడడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు.

టెన్త్‌లో శతశాతం ఉత్తీర్ణత తప్పనిసరి

- డీఈవో బ్రహ్మాజీరావు



మాట్లాడుతున్న డీఈవో బ్రహ్మాజీరావు

అనంతగిరి: టెన్త్‌లో శతశాతం ఉత్తీర్ణత సాధించాలని డీఈవో బ్రహ్మాజీరావు ఆదేశించారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాల 1ను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తమ ఫలితాల సాధనకు ఉపాధ్యాయులంతా శక్తివంచన లేకుండా కృషి చేయాలని కోరారు. అనంతరం విద్యార్థినులతో మాట్లాడారు. అనంతరం మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల హెచ్‌ఎంలతో ఆయన సమావేశమయ్యారు. మధ్యాహ్న భోజన పథకం ప్రతి పాఠశాలలో పక్కాగా అమలు చేయాలని సూచించారు. నాడు–నేడు పనులను పర్యవేక్షించాలని, ప్రతిరోజు ముఖ ఆధారిత హాజరు తప్పనిసరిగా వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలోని ఎంఈవో బాలాజీ పాల్గొన్నారు.

విద్యార్థిని మృతిపై విచారణ



రికార్డులను పరిశీలిస్తున్న ఏటీడబ్ల్యూవో రజని

డుంబ్రిగుడ (అరకులోయ టౌన్): మండలంలోని జాముగుడ ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థిని జన్ని మేరి(13) మృతిపై పీవో అభిషేక్ ఆదేశాల మేరకు మంగళవారం ఏటీడబ్ల్యూవో ఎల్.రజిని విచారణ నిర్వహించారు. పాఠశాలలో హెచ్‌ఎం సుజాత నుంచి వివరాలు సేకరించారు. పాఠశాలలో రికార్డులను పరిశీలించారు. విద్యార్థిని స్వగ్రామమైన అరకులోయ మండలం సిర్గం పంచాయతీ వరతోకవలసలో తల్లిదండ్రుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. ఈ మేరకు సమగ్ర వివరాలతో పూర్తిస్థాయి నివేదికను పాడేరు ఐటీడీఏ పీవోకు అందజేస్తామన్నారు.

విద్యార్థినుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

గిరిజన సంక్షేమ గృహాల్లో విద్యార్థినుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని పాడేరు ఐటీడీఏ పీవో ఆదేశించారని ఏటీడబ్ల్యూవో ఎల్.రజిని తెలిపారు. అనారోగ్యానికి గురైన విద్యార్థినులను వెంటనే సమీప ఆస్పత్రికి తరలించాలని, అవసరమైతే జిల్లా ఆస్పత్రికి, కేజీహెచ్‌కు తీసుకువెళ్లాలని ఆయన సూచించారన్నారు. ఐటీడీఏ ట్రైబల్ సెల్ ద్వారా అత్యవసర వైద్యం అందేలా చర్యలు తీసుకుంటామని పీవో తెలిపారని ఆమె వివరించారు. ఆయన ఆదేశాల మేరకు తక్షణ వైద్యంతోపాటు తగిన పౌష్టికాహారం అందించేలా చర్యలు చేపట్టామని ఆమె పేర్కొన్నారు.

ఎంఎస్‌ఎంఈ ఎక్స్‌పో–24కు సర్వం సిద్ధం



ప్రదర్శనకు సిద్ధమవుతున్న స్టాల్స్

అక్కిరెడ్డిపాలెం: బుధవారం, గురువారం నిర్వహించనున్న ఎంఎస్‌ఎంఈ ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్‌కు ఆటోనగర్‌లోని ఎంఎస్‌ఎంఈ ఫెసిలిటేషన్ కార్యాలయ ఆవరణ సిద్ధమైంది. ఎగ్జిబిషన్‌ను అనకాపల్లి ఎంపీ డాక్టర్ భీశెట్టి వెంకట సత్యవతి, బీజేపీ ఎంపీ జీవీఎల్ నర్సింహారావు, ఎంఎస్‌ఎంఈ నేషనల్ బోర్డు మెంబర్ పి.విష్ణుకుమార్ రాజు ముఖ్య అతిథులుగా ప్రారంభించనున్నారని ఎంఎస్‌ఎంఈ ఏడీ, ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ ఏ.శ్రీను తెలిపారు. ఎగ్జిబిషన్‌లో పారిశ్రామిక ఉత్పత్తుల ప్రదర్శన, పలు ప్రభుత్వ రంగ సంస్థలు, వివిధ బ్యాంకులకు సంబంధించి 40 స్టాళ్లు సిద్ధం చేస్తున్నారు. ప్రారంభ కార్యక్రమంలో ఎంఎస్‌ఎంఈ – డీఎఫ్‌వో డి.చంద్రశేఖర్, స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్, బీడీఎల్ జీఎం ఆర్.సింహాచలం, హిందూస్తాన్ షిప్‌యార్డ్ డైరెక్టర్ ఎస్.వి.రాంబాబు, ఎస్‌ఆర్‌డీసీ సీనియర్ మేనేజర్ బిజయ్‌కుమార్ సాహూ, డీఐసీ జీఎం సీహెచ్.గణపతి, వాసీవా అధ్యక్షులు సజ్జా పాండురంగ ప్రసాద్, ఐలా చైర్మన్ కె.సత్యనారాయణ రెడ్డి (రఘు) పాల్గొంటారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్(విశాఖ) : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాలను నిర్మూలిద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న పీవో సూరజ్‌గనోరే



హాజరైన ఉద్యోగులు

రంపచోడవరం: ఏజెన్సీలోని బాల్య వివాహాలు నిర్మూలించే బాధ్యత మన అందరిపై ఉందని స్థానిక ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే అన్నారు. బాల్యవివాహాల నిర్మూలనపై ఐటీడీఏ సమావేశ మందిరంలో మంగళవారం సీడీపీవోలు, సూపర్‌వైజర్లు, తొమ్మిదో తరగతి విద్యార్థినులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అమ్మాయిలకు 18 సంవత్సరాల వయసు నిండకుండా వివాహం చేస్తే నేరమని, అటువంటి వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటారని తెలిపారు. 18 సంవత్సరాల వయసు నిండకుండా గర్భం దాలిస్తే ఆరోగ్యపరంగా సమస్యలు నెలకొంటాయన్నారు. ఏజెన్సీలో ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే వెంటనే ఐసీడీఎస్, పోలీసు అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. వివాహ వయసు అమ్మాయికి 18 సంవత్సరాలు, అబ్బాయికి 21 సంవత్సరాలు ఉండాలన్నారు.బాల్య వివాహాలకు సహకరించే వారికి రెండేళ్ల జైలు శిక్ష , రూ. లక్ష జరిమానా విధిస్తారని తెలిపారు, బాల్య వివాహాలకు ముగింపు పలుకుదాం అనే నినాదంతో అందరూ ముందుకు సాగాలని ఆయన అన్నారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై గ్రామాల్లో అవగాహన కల్పించాలని విద్యార్థినులకు పీవో సూచించారు. ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి, ఏపీడీ వెలుగు శ్రీనివాసరావు, డీడీవో కె.కోటేశ్వరరావు, ఏడీఎంహెచ్‌వో ప్రకాశం, సీడీపీవో సంధ్యారాణి, ప్రసన్నలక్ష్మి, సుధా పాల్గొన్నారు.